సాక్షి
ప్రకాశం
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



కోటాలో కోత

రేషన్ బియ్యం కోటాలోనూ కూటమి ప్రభుత్వం కోత పెట్టింది. ఒక్కసారిగా బియ్యం తక్కువ రావడంతో డీలర్లు ఆందోళన చెందారు. - 8లో..



రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

ముండ్లమూరు మండలంలోని ఓ ఉపాధ్యాయుడి అకౌంట్ నుంచి రూ.5,18,000 సైబర్ నేరగాళ్లు దోచేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా పాలకవర్గం ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎంపికైన ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన పాలకవర్గం

ఒంగోలు సిటీ: ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నెల్లూరు జిల్లా ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కిరణ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఫైనాన్షియల్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి గా మార్కాపురం సబ్ ట్రెజరీ అధికారి ఎన్‌వీ కృష్ణ, కార్యదర్శిగా జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న పీ అంక బాబు, సహాధ్యక్షునిగా గిద్దలూరు సబ్ ట్రెజరీ అధికారి పీవీఎల్ఎస్ వరకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కే లావణ్య, ఉపాధ్యక్షులుగా జిల్లా ట్రెజరీ లో సబ్ ట్రెజరీ ఆఫీసర్ గా పనిచేస్తున్న బీ అక్కేశ్వర రావు, పొదిలి సబ్ ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న ఎస్‌కే కరిముల్లా, కే వెంకటేశ్వర్లు, మహిళా సంయుక్త కార్యదర్శులుగా జిల్లా ట్రెజరీలో జూనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న పీ హేమలత, మిగతా సంయుక్త కార్యదర్శులుగా కనిగిరి సబ్ ట్రెజరీలో జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కే ప్రసాద్ చంద్ర, యర్రగొండపాలెంలో జూనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న డీ అనిల్, కోశాధికారిగా జిల్లా ట్రెజరీ లో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న కే రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కందుకూరు సబ్ ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న సీహెచ్ ఫణీంద్ర, జిల్లా ట్రెజరీలో ఆఫీసు సబార్డినేట్ గా పనిచేస్తున్న ఐ కిషోర్ బాబు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉప ఎన్నికల అధికారిగా సీహెచ్ విజయ కృష్ణ, పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డీ.రమణా రెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర నాయకులు పాముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమంపై శీతకన్ను

పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. వెలుగొండ ప్రాజెక్టు..మెడికల్ కాలేజీ.. మార్కాపురం జిల్లా.. ఇలా ఏ ఒక్క అభివృద్ధి పనినీ పట్టించుకోకుండా తీరని ద్రోహం చేస్తోంది. వెలుగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయించగా..మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేసింది. ఇక మార్కాపురం జిల్లా చేస్తామన్న ఊసే మరిచిపోయింది. ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు.

- హామీలు మరిచి అభివృద్ధికి పాతరేసిన కూటమి ప్రభుత్వం
- ఆగిన మెడికల్ కళాశాల నిర్మాణం
- జీజీహెచ్‌లో వైద్యుల కొరత
- వెలుగొండకు అరకొర నిధులు
- ఏర్పాటుకాని మార్కాపురం జిల్లా



ఆగిన మెడికల్ కళాశాల భవనాలు

మార్కాపురం:

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో గత ప్రభుత్వంలో వడివడిగా సాగిన అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి ప్రొఫెసర్లను నియమించారు. పెద్దదోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేశారు.

పొదిలి పెద్దచెరువు నిర్మాణానికి రూ.50 కోట్లు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన మెడికల్ కళాశాల నిర్మాణం నిలిచిపోయింది. జిల్లా వైద్యశాల నుంచి జీజీహెచ్‌గా మారి అత్యున్నతమైన కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా పేద ప్రజలకు అందించే హాస్పిటల్‌కు నేడు రోగులు కరువయ్యారు. సుమారు 45 మందికి పైగా వైద్యులను బదిలీ చేసిన ప్రభుత్వం వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో వైద్యసేవల కోసం మళ్లీ యధావిధిగా గుంటూరు, ఒంగోలుకు వెళ్తున్నారు. ప్రస్తుతం 22 మంది వైద్యులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డాక్టర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు కలిపి 75 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే మెడికల్ కాలేజీని అర్ధంతరంగా ఆపడంతో పాటు పీపీపీ విధానంలో చేస్తామంటూ చేసిన ప్రకటన కూడా వాస్తవ రూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వ తీరుపై ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలగా మారిన జిల్లా ఏర్పాటు:

గత ఎన్నికలకు ముందు మార్కాపురాన్ని జిల్లాగా చేసి సీఎంగా మార్కాపురం వస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు హామీ నెరవేర్చకుండానే మార్చి 8న మార్కాపురంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరయ్యారు.

అప్పుడు కూడా ప్రజలు అడిగిన ప్రశ్నలకు కచ్చితంగా జిల్లా చేస్తానని హామీ ఇచ్చాడు. కానీ ఎప్పట్లోగా చేస్తానని మాత్రం ప్రకటించలేదు. మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటైతే జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కలెక్టర్, ఎస్పీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, జేడీలు, వైద్యశాఖ డీఎంహెచ్ఓ, ఇతర సంక్షేమ శాఖల ఈడీలు ఇక్కడే ఉండి అభివృద్ధిని పర్యవేక్షించే అవకాశం ఉంది. దీంతోపాటు జిల్లా ఏర్పాటైతే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులొస్తాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా మార్కాపురానికి వస్తుంది.



వెలుగొండ టన్నెల్



అలంకారప్రాయంగా జీజీహెచ్

వెలుగొండకు అరకొర నిధులు

అధికారంలోకి రాగానే వెలుగొండను పూర్తిచేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఏమాత్రం సరిపోవు. ముంపు గ్రామాల ప్రజల ఆర్అండ్ఆర్ ప్యాకేజీల కోసం కనీసం రూ.1200 కోట్లు కేటాయించాలి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సిబ్బంది జీతభత్యాలకు, అరకొర పనులకు మాత్రమే ఉపయోగపడతాయి. మరోవైపు ప్రాజెక్టును 2026కు పూర్తిచేస్తామని చెబుతున్నా నిధుల కేటాయింపు జరగకపోవడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇలా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

వెలుగొండను త్వరగా పూర్తిచేయాలి



వెలుగొండ ప్రాజెక్టును ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి. పోలవరానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో.. వెలుగొండకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ వరద సీజన్‌లోనే కృష్ణా జలాలను వెలుగొండ ద్వారా ఈ ప్రాంతానికి అందించాలి. కనీసం రూ.1500 కోట్లు కేటాయిస్తేనే ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందుతాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి త్వరగా ముంపు గ్రామాల ప్రజలను కాలనీలకు తరలించాలి.

– సోమయ్య, సీపీఎం నాయకులు

మెడికల్ కాలేజీని పూర్తిచేయాలి



రాష్ట్ర ప్రభుత్వం మార్కాపురంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వమే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలి. పీపీపీ విధానం వద్దు. జీజీహెచ్‌లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. మార్కాపురాన్ని జిల్లా చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నాయకులు

నీళ్లలోనూ దోపిడీ

- నీళ్ల ట్యాంకర్ల టెండర్‌లోనూ అడ్డగోలు
- కాంట్రాక్టర్లు కూటమి కట్టి ఐదు శాతం ఎక్సెస్‌కు
- 45 రోజులకు రూ.40 లక్షల చొప్పున మంచినీటి సరఫరాకు ఖర్చు
- కార్పొరేషన్‌కు రెండు ట్యాంకర్లు ఉంటే లేవని టెండరు షెడ్యూల్‌లో పేర్కొన్న అధికారులు
- కార్పొరేషన్ ఖజానాకు తూట్లు



మున్సిపల్ వాటర్‌ను హోటళ్లకు పోస్తున్న ట్రాక్టర్ ట్యాంకర్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థలో దోపిడీ పర్వం రాజ్యమేలుతోంది. కాంట్రాక్టర్లు ఏది చెబితే అది ఇక్కడ జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ ముఖ్యనేత ఆశీస్సులతో కాంట్రాక్టర్ల దోపిడీకి అడ్డేలేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఆఖరికి ప్రజలకు తాగునీటిని అందించే నీటి రవాణాలోనూ నిలువు దోపిడీకి తెరదీశారు. పేరుకే ఆన్‌లైన్ టెండర్...తీసుకునేది మాత్రం ఒకే ఒక్క కాంట్రాక్టర్ అన్న చర్చ కార్పొరేషన్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

నగర పాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఇటీవల ఆన్‌లైన్‌లో టెండర్ పిలిచారు. కాంట్రాక్టర్లతో కూటమి కట్టి చివరకు ఎక్సెస్‌తో టెండర్ దక్కించుకోవటం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. సింగిల్ టెండర్ పేరుతో ఐదు శాతం (4.99 శాతం) ఎక్సెస్‌తో కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. మంచినీటి పైపులైన్లు లేని ప్రాంతాలకు, శివారు ప్రాంత కాలనీల ప్రజలకు మంచినీటిని వేసవిలో అందించేందుకు ఎక్కువ మొత్తంలో నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. సాధారణంగా నగరంలో ఏడాది పొడవునా శివారు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తుంటారు. కానీ వేసవిలో మాత్రం ఎక్కువగా నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఇటీవల టెండరు పిలిచారు.

45 రోజులకు రూ.40 లక్షలు..

శివారు ప్రాంత కాలనీలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్ల కోసం రూ.40 లక్షలకు టెండరు పిలిచారు. ఈ నిధులు 45 రోజులకు సరిపోతాయి. అంటే రోజుకు రూ .80 వేల చొప్పున మంచినీటి సరఫరాకు ఖర్చు చేస్తున్నారు. ఎక్సెస్ టెండరు కాకుండానే. అంటే ఏరియాలను బట్టి ట్రిప్పులు ఎక్కువ కావాల్సి వస్తుందని అంచనాలు రూపొందించారు. మొత్తం నగరంలోని 37 ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నీటిని సరఫరా చేయాల్సి ఉంది. 43 ట్యాంకర్లు రోజుకు 240 నుంచి 260 ట్రిప్పులు తోలుతున్నట్లు లెక్కల్లో చూపిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు రూ.370 చొప్పున టెండరు దక్కించుకున్నారు. దానికి 5 శాతం మళ్లీ అదనం. దీంతో మరో రూ.2 లక్షలు పడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

నగర పాలక సంస్థకు ట్యాంకర్లు లేవట !

నగర పాలక సంస్థ ప్రకటించిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ ఆన్‌లైన్ టెండర్‌లో సొంతంగా ట్రాక్టర్లు లేవని చూపించింది. వాస్తవానికి ఒంగోలు నగర పాలక సంస్థకు రెండు వాటర్ ట్రాక్టర్ ట్యాంకర్లు ఉన్నాయి. 2022లో ఎన్‌క్యాప్ నిధులతో ఆ రెండు ట్యాంకర్లు కొనుగోలు చేశారు. అయితే రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ట్యాక్సులు కట్టలేదన్నది ఒకటైతే అసలు ట్యాంకరుకు రిజిస్ట్రేషన్ చేయించకుండా రోడ్డు మీద తిప్పుతున్నారు. అది గమనించిన రవాణా శాఖ అధికారులు ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. దాంతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు రెండో ట్రాక్టర్‌ను, ట్యాంకరును ఫిల్టర్ బెడ్‌లో దాచిపెట్టారు. ఇన్ని అక్రమాలు చేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు సొంత ట్యాంకర్లు ఉన్నా లేవని ఆన్‌లైన్ టెండర్‌లో చూపించారు. దీనిని బట్టి కార్పొరేషన్‌లో అవినీతి ఏస్థాయిలో ఉందోనన్న విషయం అర్థమవుతుందన్న విమర్శలు ఉన్నాయి.

బ్లాక్‌లో హోటళ్లకు, కల్యాణ మండపాలకు నీటి సరఫరా...

ప్రజలకు నీటి సరఫరా చేయటానికి టెండరు వేస్తే సాగర్ నీటిని బ్లాక్‌లో హోటళ్లకు, రెస్టారెంట్లకు, కళ్యాణ మండపాలకు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ట్యాంకరు రూ.1000 నుంచి అవసరాన్ని బట్టి రూ.2 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని సమాచారం. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవటంతో దోపిడీకి అంతేలేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి 45 రోజులకు వేసే టెండర్లలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

నీటి సరఫరాలో అక్రమాలు లేవు

నీటి సరఫరాలో అక్రమాలు లేవు. సింగిల్ టెండర్ ఈ–ప్రొక్యూర్‌మెంట్ ఆన్‌లైన్ టెండర్. అందులో మేము ఏమీ చేయలేం. కమీషన్ల వ్యవహారం నాకు సంబంధం లేదు.

– డాక్టర్ కే.వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర కమిషనర్



ఫిల్టర్ బెడ్‌లో దాచిపెట్టిన నగర పాలక సంస్థకు చెందిన ట్రాక్టర్ ట్యాంకర్

29న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టీ భరద్వాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు, పేటీఎం కంపెనీల్లో ఏజెంట్లు, ఫీల్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఏదైనా విభాగంలో ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియెట్, లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతను బట్టి నెలకు రూ.18,500ల నుంచి రూ.30 వేల వరకూ ఇస్తారని చెప్పారు. జిల్లాకు చెంది 18 సంవత్సరాల వయస్సు నిండి, 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు అర్హత పరీక్షల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో రావాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో 08592 28176 అనే నంబరును సంప్రదించాలన్నారు.

అజ్ఞాతంలోనే నిందితులు

- వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుల కోసం పోలీసుల ముమ్మర గాలింపు
- అనుమానితుల ఫోన్లన్నీ స్విచాఫ్
- రెండు వాహనాలు దొరికినా పురోగతి లేని దర్యాప్తు



ఒంగోలు టౌన్: నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి కేసులోని నిందితులంతా ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నారు. వారి ఫోన్లన్నీ స్విచాఫ్ వస్తుండడం దర్యాప్తునకు అవరోధంగా మారింది. హత్య జరిగి ఆరు రోజులైనా ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లు విచారణ కొనసాగుతోంది. శుక్రవారం చీమకుర్తిలో స్కూటీ దొరికేంత వరకు అసలు ఒక్క ఆధారం కూడా లభించలేదు. ఆ తరువాత స్కూటీ లభించడంతో దర్యాప్తు ఆఘమేఘాల మీద ముందుకు సాగింది. ఈ శనివారం రెండో వాహనం కూడా దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. దాంతో అంతా వీరయ్య కేసు కొలిక్కి వచ్చిందనుకున్నారు. కానీ నిజానికి అక్కడ నుంచే అసలు కథ మొదలైంది. ప్రధాన నిందితుడిగా మొదట్నుంచి అనుమానిస్తున్న అమ్మనబ్రోలుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నప్పటికీ మిగతా వారి విషయంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. హత్యలో నేరుగా పాల్గొన్న కొప్పోలు ప్రాంతానికి చెందిన నిందితుడు పట్టుబడితే పాత్రధారులు, సూత్రధారుల గుట్టు బయట పడుతుందని పోలీసులు భావిస్తున్నారు.

వైజాగ్‌లో కొప్పోలు వాసి?

కొప్పోలుకు చెందిన నిందితుడు ఈ కేసులో కీలకంగా మారాడు. వీరయ్య చౌదరి హత్యలో స్వయంగా పాల్గొనడమే కాకుండా మిగతా ముగ్గురు నిందితులు కూడా అతడి పర్యవేక్షణలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కొప్పోలు వ్యక్తితో పాటుగా మిగతా ముగ్గురు నిందితులు కూడా హత్య జరిగిన రోజు నుంచి పరారీలో ఉన్నారు. వైజాగ్ పారిపోయినట్లు భావిస్తున్న పోలీసు అధికారులు ఒక బృందాన్ని అక్కడకు పంపించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే హత్య జరిగినప్పటి నుంచి నిందితుల ఫోన్లన్నీ స్విచాఫ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో పోలీసులకు నిందితుల జాడ తెలియడం లేదు. అతడి కోసం విస్తృతంగా గాలింపు చేపట్టినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. దీనిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద ఇప్పుడు కొప్పోలు నిందితుడి చుట్టే వ్యవహారం నడుస్తోంది.

హైదరాబాద్‌లోనూ ఇదే కథ...

వీరయ్య చౌదరి హత్య కేసులో అమ్మనబ్రోలుకే చెందిన మరొక వ్యాపారి పేరు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అతడు కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. వీరయ్య హత్య జరిగిన రోజు నుంచే ఆయన ఫోన్ పనిచేయడం లేదని, స్విచాఫ్ అని వస్తోంది. ఆయన కోసం హైదరాబాద్‌కు రెండు పోలీసు బృందాలు వెళ్లాయి. హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద పగలు రాత్రి కాపు కాస్తున్నారు. అయితే అతడు హైదరాబాద్‌లోనే ఉన్నాడో లేక ఢిల్లీలో ఉన్నాడో తెలియడం లేదు. ఆయనకు దుబాయ్‌లో వ్యాపారాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ఒకవేళ దుబాయ్ చెక్కేసి ఉన్నా ఆశ్చర్యం లేదని ప్రచారం జరుగుతోంది.

కొనసాగుతున్న అనుమానితుల విచారణ..

ఇదిలా ఉండగా వీరయ్య చౌదరి హత్య కేసులో ఇంకా అనేక మంది అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు. దీంతో పోలీసుల అదుపులో ఉన్న ప్రధాన అనుమానితుడితో సన్నిహిత సంబంధాలు కలిగిన వారంతా భయాందోళనకు గురవుతున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధు మిత్రులనే కాకుండా వీధిలో ఎదురుపడినప్పుడు పలకరించిన వారిని కూడా పోలీసులు విచారణకు పిలుస్తుండడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పోలీసులు ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. దాంతో ఇప్పటికే గ్రామం నుంచి అనేక మంది వెళ్లిపోయినట్లు సమాచారం. అంతేకాకుండా కేసును పక్కదారి పట్టించేలా నాగులుప్పలపాడు మండలానికి చెందిన రోజుకొకరి పేర్లను టీడీపీ అనుకూల మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతలకే రుణాలు

- కార్పొరేషన్‌ల రుణాలన్నీ కూటమి నేతలు, కార్యకర్తలకే
- సిఫార్సుల మేరకు రుణాల మంజూరు
- ఇంటర్వ్యూలు లేకుండానే లబ్ధిదారుల ఎంపిక
- ఆందోళనలో నిరుద్యోగ యువత

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం పథకాలకు అర్హతలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పెట్టే అరకొర పథకాలు తమ పార్టీ సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలకే దోచిపెడుతోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కార్పొరేషన్ రుణాలు ఇస్తున్నట్లు ఎంతో ఆర్భాటంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. రుణాల మంజూరులో నిజమైన లబ్ధిదారులకు ఈ పథకం అందనంత దూరంలో ఉంది. కూటమి నేతలు, కార్యకర్తలకే రుణాలన్నీ మంజూరు చేసే ఎత్తుగడ సాగుతోంది.

ఇంటర్వ్యూలు లేకుండానే...

అరకొరగా ఉన్న వివిధ కార్పొరేషన్‌ల రుణాల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువ శాతం మండలాల్లో ఇవేమీ జరుగలేదు. కొన్ని మండలాల్లో తూతూమంత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. టీడీపీ నాయకులు చెప్పిన దరఖాస్తుదారుల గృహాల వద్దకు వెళ్లి పరిశీలించారు. మిగిలిన దరఖాస్తులను అటకెక్కించారు. విషయం తెలుసుకుని తమ దరఖాస్తులు పరిశీలించాలని కోరుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదని అర్జీదారులు వాపోతున్నారు.

విస్తృత ప్రచారం:

నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్ ఇస్తాం, ఆర్థికంగా స్థిరపడేందుకు రుణాలు మంజూరు చేస్తున్నామని విస్తృత ప్రచారం కల్పించారు. దరఖాస్తులు పెట్టుకోవాలని అధికారులతో పత్రిక ప్రకటనలు, సచివాలయాల్లో ఊదరగొట్టారు. ఇప్పుడు వేల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం తమ పార్టీ వారికే రుణాలు దోచిపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. రాజకీయ అండలేని నిరుద్యోగుల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని దోచుకునేందుకు దళారులు తయారయ్యారు. రుణాలు ఇప్పిస్తామంటూ దరఖాస్తుదారుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నారు. తాము చెబితేనే లోన్ వస్తుందని కూటమి నేతలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత ఉన్న అందరికీ రుణాలు మంజూరు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

జిల్లాలో వివిధ రకాల రుణాల వివరాలు

రుణాలు రకం	టార్గెట్	దరఖాస్తు చేసుకున్నవారు	అర్హులు
బీసీ	1407	12604	11510
కాపు	197	3553	3228
బ్రాహ్మిణ్	14	74	65
ఈబీసీ	41	262	225
క్షత్రియ	4	20	20
రెడ్డి	227	834	757
ఆర్యవైశ్య	49	422	377
కమ్మ	216	781	728

క్లుప్తంగా

టైరు పంక్చరై లారీ బోల్తా


బోల్తాపడిన సజ్జల లోడు లారీ

పెద్దారవీడు: వేగంగా వెళ్తున్న లారీ టైరు అకస్మాత్తుగా పంక్చర్ కావడంతో లారీ బోల్తా పడింది. పెద్దారవీడు మండలంలోని గొబ్బూరు–తోకపల్లి గ్రామాల మధ్య ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా సీతారామపురం గ్రామం నుంచి సజ్జల లోడు లారీ హైదరాబాద్ వైపు వెళ్తోంది. ఆ సమయంలో లారీ టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ కార్తీక్ వేగాన్ని అదుపుచేసి రోడ్డు పక్కన నిలిపేందుకు ప్రయత్నించగా, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి లారీ బోల్తాపడింది. లారీలో డ్రైవర్, క్లీనర్, ఇద్దరు కూలీలు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే మరో లారీలో సజ్జల బస్తాలు లోడ్ చేసి పంపించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ లోపలి గేటు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్సు బస్టాండ్ లోపలి గేటు గుండా వెళ్లే ప్రయత్నంలో ఆ సమయంలో బస్సుకు అడ్డంగా వచ్చిన మహిళను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి గురించి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● నీటి కుంటలో పడి బాలుడు మృతి

కనిగిరి రూరల్: ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి బాలుడు మృతిచెందిన సంఘటన కనిగిరి మండలంలోని భూతంవారిపల్లిలో జరిగింది. భూతంవారిపల్లికి చెందిన సీ శ్రీను కుమారుడు చిన్ని (12) కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో గ్రామానికి చెందిన తోటి స్నేహితుడితో కలిసి ఊరి చివర ఉన్న నీటి కుంట దగ్గరికి వెళ్లాడు. చిన్ని సరదాగా ఈత కొట్టేందుకు నీటి గుంతలో దిగాడు. గుంత లోతుగా ఉండటంతో లోపలికి వెళ్లిన చిన్ని తిరిగి పైకి రాలేదు. దీంతో పక్కనే ఉన్న బాలుడు ఆందోళన చెంది గ్రామస్తులకు తెలియజేశాడు. వారు వెంటనే వచ్చి నీటి కుంటలో నుంచి చిన్నిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదం అలముకుంది.

కూటమి ప్రభుత్వం కోతల ప్రభుత్వంగా మారింది. ఇప్పటికే సంక్షేమ పథకాలకు కత్తెర వేసిన ప్రభుత్వం..తాజాగా పేదలకు అందించే రేషన్ బియ్యంలోనూ కోత విధించింది. రేషన్ సరుకుల్లో కందిపప్పును ఎత్తేసిన ప్రభుత్వం..ఇస్తున్న బియ్యంలోనూ కోత విధించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బియ్యంలో కోత విధించిన దాఖలాలు ఎప్పుడూ లేదని, పేదల నోటికాడి ముద్దను ప్రభుత్వం లాక్కోవాల్సి చూస్తోందని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

కోటాలో కోత..!


రేషన్ పంపిణీ వాహనం

నియోజకవర్గంలో రేషన్ కార్డులు	ఆరు మండలాల్లో రేషన్ షాపులు	తగ్గిన రేషన్ కోటా
86000	21	30 శాతం (సుమారు)

రెండు ఎఫ్‌సీఐ గోడౌన్ల పరిధిలో రేషన్ బియ్యం సరఫరా 1,200 టన్నులు

- బియ్యం కోటాలో కోత విధించిన ప్రభుత్వం
- కార్డుదారులందరికీ అందని బియ్యం
- ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్న రేషన్‌డీలర్లు
- తక్కువ బియ్యం రావడంతో అక్రమార్కులకు తగ్గిన వాటా
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష కట్టింది. గతంలో ఇస్తున్న పథకాలన్నింటినీ అటకెక్కించిన ప్రభుత్వం..ఇప్పుడు తాజాగా రేషన్ బియ్యంలోనూ కోత విధించింది. ప్రతి నెలా జిల్లాకు మంజూరయ్యే రేషన్ బియ్యం కోటాలో కోత పెట్టింది. ఒక్కసారిగా బియ్యం తక్కువ రావడంతో డీలర్లు ఆందోళన చెందారు. గత మూడు నెలల్లో జరిగిన బియ్యం పంపిణీని సగటుగా తీసుకోవడంతో పాటు మార్చి క్లోజింగ్ బ్యాలెన్స్ తీసివేసి ఏప్రిల్‌కు బియ్యం కోటా మంజూరు చేసినట్లు సమాచారం. దీంతో వాస్తవ అలాట్‌మెంట్ కంటే దాదాపు 30 శాతం తగ్గించినట్లు వచ్చినట్లు తెలిసింది. 100 క్వింటాళ్లకు కేవలం 70 క్వింటాళ్లకు మాత్రమే రేషన్ దుకాణాలకు కేటాయించింది. అయితే ఈ విషయమై ఎటువంటి అధికార ప్రకటన వెలువడలేదు. బియ్యం కోటా తక్కువగా రావడంతో డీలర్లు విచారించినా దీనిపై పట్టించుకునే వారే కరువయ్యారు.

తమ్ముళ్లలో 'పరేషాన్'

ఏప్రిల్ నెల బియ్యం కోటాలో కోత విధించడంతో రేషన్ డీలర్లుగా ఉన్న తమ్ముళ్లు పరేషాన్‌కు గురయ్యారు. వాస్తవానికి ప్రతి రేషన్ డీలర్ సుమారు 30 శాతం వరకు మిగుల్చుకుంటారు. 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం కేటాయిస్తే అందులో 70 నుంచి 75 శాతం మాత్రమే వాస్తవ పంపిణీ చేస్తారు. 10 నుంచి 15 శాతం మందికార్డులకు బియ్యం ఆయిపోయాయంటూ బియ్యానికి బదులు నగదు ఇచ్చి థంబ్ వేయించుకుంటారు. ప్రతి షాపులో కనీసం 20 శాతం సరుకు నిల్వలు ఉంటాయి. ప్రతి నెలా ప్రభుత్వానికి సేల్స్ అండ్ స్టాక్‌పై నివేదికలు ఇవ్వాలి. కానీ డీలర్లు మిగిలిన బియ్యాన్ని కేజీ రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ నెలలో రావాల్సిన బియ్యం కోటాలో 30 శాతం తక్కువ రావడంతో డీలర్లు ఏం చేయాలో ఆందోళన చెందారు. తగ్గిన బియ్యం కోటాను ఎలా పంపిణీ చేయాలో, ఎలా మిగుల్చుకోవాలో తెలియక తికమకపడ్డారు. కోటా కోతలో కొన్ని చోట్ల ఎండీయూ ఆపరేటర్‌లను, డీలర్లను కార్డుదారులు నిలదీసిన సంఘటనలూ ఉన్నాయి. . దీంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి 10 శాతం అదనంగా కేటాయించి కార్డుదారులకు అరకొరగా పంపిణీ చేశారు. అయితే ఎక్కడా సమస్య బయటకు రాకుండా అధికారులు, డీలర్లు, అధికార పార్టీ నేతలు గప్‌చుప్‌గా వ్యవహారం నడిపించారు. కనిగిరిలో సుమారు 20 దుకాణాల వారు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల అనుమతితో అదనంగా 10 శాతం బియ్యాన్ని కేటాయించుకొని పంపిణీ చేసినట్లు సమాచారం.

అధికారులు, డీలర్ల మధ్య వార్...

30 శాతం తక్కువ కోటా కేటాయించడంపై డీలర్లు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 95 శాతం రేషన్ దుకాణాలను లాగేసుకొని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకు కేటాయించింది. ఏళ్ల తరబడి రేషన్ దుకాణం నిర్వహిస్తున్న వారి వద్ద కూడా నిర్దాక్షిణ్యంగా లాక్కున్నారు. ప్రస్తుతం అధిక శాతం మంది డీలర్లు కూటమి నేతలే కావడంతో వారంతా అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో విధి లేని పరిస్థితుల్లో వచ్చే నెలలో గతంలో కేటాయించిన విధంగానే అలాట్‌మెంట్ చేస్తామని చెప్పి సర్దిచెప్పి పంపించారు.

కేటాయింపు ఇలా..

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న రెండు ఎఫ్‌సీఐ గోడౌన్‌ల పరిధిలో ఏప్రిల్ నెల రేషన్ బియ్యం సరఫరాలో సుమారు 300 టన్నులు తగ్గించినట్లు తెలిసింది. కనిగిరి ఎఫ్‌సీఐ పరిధిలోని నాలుగు మండలాల రేషన్ షాపులకు 650 టన్నులకు 530 టన్నుల కేటాయించగా, పామూరు గోడౌన్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం మండలాల రేషన్ కార్డులకు సంబంధించి 520 టన్నులకు గాను 350 టన్నులు కేటాయింపులు చేసినట్లు సమాచారం.

> **కోతలు లేకుండా రేషన్‌ను అందజేయాలి:**
> కూటమి ప్రభుత్వంలో అన్నింటిలో కోతలు పెడుతున్నారు. ఇప్పుడు రేషన్ బియ్యంలోనూ కోత విధించడం దారుణం. ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే 300 టన్నులకు పైగా కోత విధించారు. ప్రభుత్వం విధానం మార్చుకోకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.
> – పందిటి మోహన్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి)

ముగిసిన యూటీఎఫ్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ఒంగోలు సిటీ: యూటీఎఫ్ రాష్ట్ర సంఘ పిలుపు మేరకు జిల్లా శాఖ రెండు రోజుల శిక్షణ తరగతులు శని, ఆదివారాల్లో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ లో నిర్వహించామని జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వీరాంజనేయులు తెలిపారు. శిక్షణ తరగతులను రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె శ్రీనివాసరావు ప్రారంభించారు. యూటీఎఫ్ భావజాలాన్ని సహాధ్యక్షుడు కే సురేష్ కుమార్ వివరించారు. విద్యారంగ పరిణామాలను ఎస్ నవకోటేశ్వరరావు, సంస్థ నిర్మాణాలను కర్తవ్యాలను కే శ్రీనివాసరావు, ఆడిట్ రికార్డు నిర్వహణపై ఎస్ చిన్నస్వామి, ఎం రాము అవగాహన కల్పించారు. ఆదివారం పెన్షన్ రూల్స్‌ను జే కేశవరాజు, లీవ్ రూల్స్‌ను రాష్ట్ర నాయకులు టీఎస్ఎల్ఎస్ మల్లేశ్వరరావు, బదిలీల చట్టం నిబంధనను ఎస్ రవి, సీపీఎస్ పెన్షన్, జెడ్పీ పీఎఫ్ లోన్స్, మెడికల్ బిల్స్‌పై ఎస్కే అబ్దుల్ హై, వర్తమాన రాజకీయాలను డీ వీరాంజనేయులు, మహిళా ఉద్యమం గురించి జీ ఉమామహేశ్వరి వివరించారు. మే 2వ తేదీ డీ రామిరెడ్డి తొమ్మిదో వర్ధంతి సభ, స్మారక ఉపన్యాసం దర్శిలో జరుగుతుందని, జయప్రదం చేయాలని కోరారు.

ఒంగోలు రైల్వేస్టేషన్లో తనిఖీలు

ఒంగోలు టౌన్: పహల్గామ్‌లో ఉగ్రదాడుల నేపథ్యంలో ఒంగోలులోని రైల్వేస్టేషన్లో జీఆర్‌పీ పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీఆర్‌పీ సీఐ షేక్ మౌలా షరీఫ్, ఎస్ఐ కె.మధుసూదనరావు పాల్గొని మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ (ఎంఎస్‌డీసీ) ద్వారా తనిఖీలు చేసి పలువురు అనుమానితులను గుర్తించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా వారిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే ప్లాట్‌ఫాం, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

● నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపు


మార్కాపురం: వైఎస్సార్ సీపీ పటిష్టతపై దృష్టి సారించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మార్కాపురం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధిపై దృష్టిపెట్టాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన తీరును వివరించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాలు, ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్దామన్నారు. ప్రతి కార్యకర్తకూ తాను అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పార్టీలో కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. తాను ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తను గుర్తిస్తానన్నారు. కార్యకర్తలు నిరాశ, నిస్పృహలు వీడాలని సూచించారు. అందరం ఐకమత్యంగా ఉండి పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేద్దామన్నారు.

పహల్గామ్ మృతులకు ఘన నివాళులు...

కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఖండించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మేడా బద్రీనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, కొత్త కృష్ణ, చాటకొండ చంద్ర, సలీమ్, పార్టీ నాయకులు ఇస్మాయిల్, సురేష్, గుంటక చెన్నారెడ్డి, బొగ్గరపు శేషయ్య, సుంకయ్య, మందటి మహేశ్వరరెడ్డి, డీవీఆర్, బోడపాడు రమణారెడ్డి, కొండలు, కాల్వ దుర్గ, చాంద్‌బాషా, ఉస్మాన్, పి.విజయలక్ష్మి, సోషల్ మీడియా రఫీ, సీఎం ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ. 3 లక్షల మేర ఆస్తినష్టం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో అగ్ని ప్రమాధం సంభవించి పొగాకు బ్యారన్ పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన అంకిరెడ్డి చెంచమ్మకు చెందిన పొగాకు బ్యారన్‌ను అదే గ్రామానికి చెందిన ఏరువ తిరుపతయ్య కౌలుకు తీసుకుని పొగాకు క్యూరింగ్ చేపట్టారు. బ్యారన్‌లో సుమారు 1100 పొగాకు అల్లుడు కర్ర క్యూరింగ్ జరుగుతుండగా ప్రమాదవశాత్తు మొద్దు గొట్టంపై అల్లుడు కర్ర పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బ్యారన్‌లోని టైర్లు, రేకులు, అల్లుడు కర్ర కాలిపోయాయి. మంటల ధాటికి బ్యారన్ గోడలు నెర్రలిచ్చాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న మార్కాపురం అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే బ్యారన్ అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. అల్లుడు కర్ర, బ్యారన్ మొత్తం రూ..3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

నోటికాడికి వచ్చింది బూడిదపాలు..

ఈ ఏడాది పొగాకు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. ధరలు లేకపోవడంతో నష్టాలు తప్పేలా లేవు. ఈ పరిస్థితుల్లో బ్యారన్ కాలిపోవడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అయింది. ప్రభుత్వం, పొగాకు బోర్డు అధికారులు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ప్రజల ప్రాణాల కంటే ఎన్నికలే ఎక్కువ

● మోదీపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు

ఒంగోలు టౌన్: దేశంలోని ప్రజల ప్రాణాల కంటే బీహార్ ఎన్నికలకే ప్రధాన మంత్రి మోదీ ఎక్కువ ప్రాధ్యాన్యత ఇవ్వడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటకులను పొట్టనబెట్టుకోవడాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ దారుణం జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆల్ పార్టీ మీటింగ్ పెట్టడం, భద్రతా లోపాల వలనే ఉగ్రవాద ఘటన జరిగిందని కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా అంగీకరించడం స్వాగతించదగిన విషయాలని చెప్పారు. అయితే, ఆల్ పార్టీ మీటింగ్‌కు హాజరు కాకుండా ప్రధాన మంత్రి మోదీ బీహార్ ఎన్నికల కోసం వెళ్లడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పరిపాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ఉగ్రవాదులు కూడా లౌకికత్వంతో కూడిన భారత ప్రజల మధ్య మత చిచ్చు పెట్టేందుకే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. టెర్రరిస్టుల దాడుల నుంచి ప్రజలను కాపాడే క్రమంలో సయ్యద్ హుస్సేన్ అనే కాశ్మీర్ యువకుడు ప్రాణాలను త్యాగం చేశాడని చెప్పారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో దేశంలోని హిందూ, ముస్లింలు, క్రిస్టియన్లు సోదర భావంతో బతుకుతున్నారని, రాజ్య కాంక్షతో బీజేపీ మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో పారదర్శకత లోపించిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, శ్రీలంకను చేస్తున్నారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పుల మీద అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతి నిర్మాణం నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకుందని, అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి, హెడ్స్ నుంచి, కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.31 వేల కోట్ల అప్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. మరో రూ.30 వేల కోట్లను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, కొద్దిపాటి నిధులతో పూర్తయ్యే ప్రాజెక్టులను కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల కమిటీ ఏర్పాటు...

ఆగస్టు 20 నుంచి 24వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిటీని ఎంపిక చేశారు. ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎంఎల్ నారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.వెంకటరావు, కోశాధికారిగా కొత్తకోట వెంకటేశ్వర్లుతో కమిటీని ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, రావులపల్లి రవీంద్రనాథ్, ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు


- ఓ ఉపాధ్యాయుడి బ్యాంకు ఖాతా ఖాళీ
- రూ.5,18,000 దోచేసిన వైనం
- కుమారుడి చదువు కోసం దాచుకున్న నగదు మాయం కావడంతో తీవ్ర ఆవేదనలో బాధితుడు

ముండ్లమూరు (కురిచేడు):

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ పెట్రేగిపోతున్నారు. అమాయకుల బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇతర అవసరాల కోసం ప్రజలు దాచుకున్న నగదును దోచేస్తున్నారు. సంబంధిత బ్యాంకుల నుంచి ఖాతాదారులకు సకాలంలో మెసేజ్‌లు కూడా రాకపోతుండటంతో వెంటనే అప్రమత్తం కాలేకపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మళ్లీమళ్లీ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా ముండ్లమూరులో వెలుగుచూసిన ఘటనే ఇందుకు నిదర్శనంగా ఉంది. స్థానిక మోడల్ పాఠశాలలో సివిక్స్ బోధించే ఉపాధ్యాయుడు ఎర్రబోయిన వెంకట సుబ్బారావు తన కుమారుడు అబ్రాడ్‌లో చదువుతుండటంతో అతని చదువు కోసం బ్యాంకులో నగదు దాచుకున్నారు. ఆ నగదులో 5,18,000 రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకుని ఖాతా ఖాళీ చేశారు. ఈ నెల 23వ తేదీ వెంకట సుబ్బారావు స్థానిక ఏపీజీబీ ఏటీఎంలో రెండు దఫాలుగా రూ.10,000, రూ.2,000 డ్రా చేశారు. అనంతరం ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు అతని ఫోన్‌కు రూ.48,000 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దాన్ని చూసి వెంకట సుబ్బారావు ఆందోళనకు గురయ్యారు. దర్శి స్టేట్ బ్యాంకులో గల అతనికి ఖాతాకు సంబంధించిన మినీ స్టేట్‌మెంట్ కోసం వెంటనే దర్శి వెళ్లారు. అక్కడున్న ఎస్‌బీఐ ఏటీఎంలో మినీ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అప్పుడుగానీ వెంకట సుబ్బారావుకు అసలు విషయం అర్థంకాలేదు. తాను నగదు డ్రా చేయకముందే మూడు సార్లు నగదు డ్రా చేసినట్లు మినీ స్టేట్‌మెంట్ రావడం చూసి నివ్వెరపోయారు. ఒకరోజు ముందుగానే ఒకసారి రూ.2.5 లక్షలు ఐడీబీఐ బ్యాంకుకు పంపినట్లు, మళ్లీ రూ.20 వేలు ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లు, మూడోసారి రూ.2 లక్షలు ఐడీబీఐ బ్యాంకుకు పంపినట్లు మినీ స్టేట్‌మెంట్లో ఉంది. కానీ, వీటిలో ఏ ఒక్కదానికీ మెసేజ్ రాలేదు. తాను విత్ డ్రా చేసిన వాటికి కూడా మెసేజ్ రాలేదు. ఆ తర్వాత రూ.48,000 డ్రా చేసినట్లు మాత్రం మెసేజ్ వచ్చింది. కుమారుడి చదువు కోసం దాచుకున్న మొత్తంలో 5,18,000 రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేయడంతో వెంకట సుబ్బారావు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్‌బీఐలో చెక్‌చేసిన మినీ స్టేట్‌మెంట్



రూ.48,000 డ్రా చేసినట్లు వచ్చిన మెసేజ్

పట్టించుకోని బ్యాంక్ అధికారులు, పోలీసులు...

సైబర్ నేరగాళ్లు తన బ్యాంక్ ఖాతాలోని రూ.5,18,000 దోచేయడంపై ఉపాధ్యాయుడు వెంకట సుబ్బారావు ఈ నెల 24వ తేదీ దర్శి స్టేట్ బ్యాంకు మేనేజర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కానీ, అక్కడ ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తన ఖాతా నుంచి నగదును సైబర్ నేరగాళ్లు ఏ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారనే వివరాలడిగినా స్పందించలేదని చెప్పారు. తన నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని సర్టిఫికెట్ ఇవ్వమన్నా ఇవ్వలేదని, అకౌంటెంట్‌కు ఫిర్యాదు చేయమని సలహా ఇచ్చారని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన బ్యాంకు ఖాతాను బ్లాక్ చేయించినట్లు తెలిపారు. బ్యాంకు వారిపై నమ్మకం లేక ఈ నెల 25వ తేదీ ఆ ఖాతాలో ఉన్న మిగతా నగదును డ్రా చేసి జాగ్రత్త చేసుకున్నట్లు చెప్పారు. మొదటిసారి నగదు ట్రాన్స్‌ఫర్ కాగానే తన సెల్‌కు బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చి ఉంటే వెంటనే అప్రమత్తమై బ్యాంకు ఖాతాను బ్లాక్ చేయించి కొంతవరకైనా నగదు నష్టపోకుండా కాపాడుకునేవాడినని, కానీ, మెసేజ్‌లు రావడం ఆలస్యం కావడం వలన పూర్తిగా నగదు నష్టపోవాల్సి వచ్చిందని సుబ్బారావు పేర్కొన్నారు. అనంతరం 1930కి ఫిర్యాదు చేశానని తెలిపారు. ముండ్లమూరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. ఎస్సై లేరని, ఆయన వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకుంటామని సిబ్బంది చెప్పడంతో వెనక్కు వచ్చినట్లు ఆయన తెలిపారు. తన బ్యాంకు ఖాతా నుంచి మాయమైన నగదును సైబర్ నేరగాళ్ల నుంచి రికవరీ చేసి తనకు ఇప్పించాలని, తన కుమారుడి చదువు ఆగిపోకుండా ఆదుకోవాలని సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.